

వేయి స్తంభాల గుడిలో కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే రాజేందర్



వేయి స్తంభాల దేవాలయంలో పూజలు చేస్తున్న యువతులు



పోచమ్మమైదాన్‌: 'అమృతవర్షిణి' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

# ఘనంగా ఉగాది వేడుకలు

- పంచాంగ శ్రవణాలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్ : క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలను హనుమకొండ, వరంగల్ జిల్లాల ప్రజలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో పంచాంగ శ్రవణాలు నిర్వహించారు. హనుమకొండలోని చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో క్రోధినామ సంవత్సరం ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉత్తిష్ఠ గణపతికి, రుద్రేశ్వరస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విష్ణు ఆలయంలో మంటపారాధన చేసి సీతారామచంద్రస్వామివార్లను ప్రతిష్ఠించి అభిషేకం నిర్వహించినట్లు ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. సీతారామచంద్రస్వామివార్ల కల్యాణ నవరాత్రి ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, సతీమణి నీలిమ, కూతురు గోదాదేవి పాల్గొని పూజలు నిర్వహించారు. సాయంత్రం పంచాంగశ్రవణం, కవిసమ్మేళనం చేపట్టారు. ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు గట్టు మహేశ్ బాబు, సీపీ అంబర్‌కిశోర్ ఝా, ఈవో వెంకటయ్య పాల్గొన్నారు. అలాగే, హనుమకొండ పద్మాక్షికాలనీలోని సిద్ధేశ్వరాలయంలో స్వామివారికి ఉగాది పచ్చడి, ఐదు రకాల పండ్ల రసాలతో ప్రత్యేక అభిషేకం నిర్వహించినట్లు అర్చకులు సిద్ధేశుని రవికుమార్, సురేశ్‌కుమార్ తెలిపారు. సుబేదారిలోని రెడ్‌క్రాస్ సొసైటీలో ఉగాది సందర్భంగా ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణం నిర్వహించారు. అనంతరం తలసీమియా బాధితులకు పండ్లు పంపిణీ చేశారు. సొసైటీ చైర్మన్ విజయ్‌చందర్‌రెడ్డి, కోశాధికారి పాపిరెడ్డి, ఈవీ శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు. అలాగే, హనుమకొండలోని స్వధార్ ఆశ్రమం, ఆనంద నిలయంలో అనురాగ్ హెల్పింగ్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ అనితారెడ్డి ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. కాజీపేటలోని శ్వేతార్క మూల గణపతి దేవాలయం, విష్ణుపురిలోని పంచ ముఖాంజనేయస్వామి ఆలయం, సోమిడిలోని సోమేశ్వరస్వామి, అభయాంజనేయస్వామి, దర్గా కాజీపేటలోని శ్రీ సీతారామచంద్ర దేవాలయం, వడ్డేపల్లి చెరువుకట్ట పై ఉన్న సుబ్రమణ్యేస్వామి, శివాలయం, ప్రశాంత్‌నగర్‌లోని రామాలయం, చైతన్యపురి కాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవాలయాలు, రైల్వే దేవాలయ సముదాయం, డీజిల్ కాలనీలోని ఆంజనేయస్వామి దేవాలయాలు భక్తులతో కిక్కిరిసి పోయాయి. దామెర మండలంలోని ఊరుగొండ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడు శ్రీనివాసాచార్యులు, పులుకుర్తి శివాలయంలో అఖిలకుమారాచార్యులు, కోగిల్వాయిలోని శ్రీచెన్నకేశవస్వామి ఆలయంలో దివి వెంకటజోగాచార్యులు పంచాంగ పఠనం చేశారు. అలాగె ల్యాదెళ్ల, ఓగులాపురం, దామెర గ్రామాల్లోని శివాలయాల్లో ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. ధర్మసాగర్ మండలంలోని ముప్పారం గ్రామంలోని ముఖ్యనాథస్వామి దేవాలయం, గీసుగొండ మండలం కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో, కోటగండి మైసమ్మ, ఊకల్ నాగేంద్రస్వామి ఆలయం, సంగెం మండలం కుంటపల్లి గ్రామంలోని రామలింగేశ్వరాలయం, శాయంపేటలోని శ్రీ మత్స్యగిరి స్వామి ఆలయంలో ఉగాది వేడుకలు జరిగాయి.

**వరంగల్ జిల్లాలో..**

క్రోధినామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని మంగళవారం వరంగల్ జిల్లావ్యాప్తంగా ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఇంటిల్లిపాది తలంటు స్నానాలు ఆచరించి, ఇంటి గుమ్మాలు, దుకాణా సముదాయాలను మామిడి తోరణాలతో అలంకరించారు. తమ ఇష్టదైవాలకు ప్రత్యేక పూజలు చేసి సంవత్సరమంతా మంచి జరగాలని కోరుకున్నారు. అనంతరం షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని ఆరగించి భక్ష్యాలు స్వీకరించారు. నర్సంపేట మండలంలోని లక్నేపల్లిలో ప్రధాన అర్చకుడు మాడుగుల బాబాశర్మ ప్రజలకు పంచాంగ పఠనం చేశారు. వర్ధన్నపేట మండలవ్యాప్తంగా ఉగాది వేడుకలు వైభవంగా జరిగాయి. మండలంలోని ఇల్లందలో శ్రీరామ నవమి వేడుకలను ప్రారంభించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గ్రామ ప్రముఖులు ఈ ఏడాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఖానాపురం మండల వ్యాప్తంగా ఆలయాల్లో వేద పండితులు పంచాంగ శ్రవణం చేశారు. కృష్ణవేణి కళా సమితి ఆధ్వర్యంలో వరంగల్ కొత్తవాడలోని పద్మశాలీ ఫంక్షన్ హాల్‌లో ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కవి సమ్మేళనం ఏర్పాటు చేసి, అమృత వర్షిణి కవితా సంకలనం పుస్తకాన్ని రచించిన కవి పాడిశెట్టి సాయన్నాచార్యులుకు జీవన సాఫల్య పురస్కారం, ప్రశంసాపత్రం అందజేశారు. మట్టెవాడలోని గోపాలస్వామి గుడిలో ఆర్యవైశ్య వాసవీమాత పరపతి సంఘం ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. అలాగే, దేశాయిపేటలోని శ్రీషిర్డీ సాయిబాబా ఆలయం, గణేశ్‌నగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయం, సెకండ్ డాక్టర్స్ కాలనీలోని వరద వేంకటేశ్వరస్వామి ఆలయం, కొత్తవాడలోని మార్కండేయ స్వామి ఆలయంలో పంచాంగం శ్రవణం జరిపారు.

**ఐనవోలు మల్లన్న ఆలయంలో..**

ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయాన్ని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. స్వామి వారి మేల్కొలుపు తర్వాత విశేష అభిషేకాలు జరిగాయి. ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్ ఆధ్వర్యంలో అర్చకుడు ఐనవోలు మధుకర్‌శర్మ, ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు చేతులమీదుగా పంచాంగాన్ని ఆవిష్కరించారు. భక్తులు తరలి వచ్చి మల్లికార్జునస్వామికి ప్రత్యేక పూజలు చేశారు.



ఐనవోలు మల్లన్న ఆలయంలో పంచాగ శ్రవణంలో పాల్గొన్న భక్తులు

## ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలి

**బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు వినయ్ భాస్కర్**

హనుమకొండ : క్రోధి నామ సంవత్సరంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ ఆకాంక్షించారు. ఉగాది పండగను పురస్కరించుకొని మంగళవారం సాయంత్రం బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో పండితులు జగన్ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. వివిధ రాశుల ఫలాలను తెలిపారు. చెడుపై మంచి పోరాటమే క్రోధి నామ సంవత్సర సారాంశమని వినయ్‌భాస్కర్ అన్నారు. కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్లు సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్, మర్రి యాదవరెడ్డి, తెలంగాణ జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయభాస్కర్, బీఆర్ఎస్ పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్, నాయకులు పీ విష్ణువర్ధన్‌రెడ్డి, వీరేందర్, జోరిక రమేశ్, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దాస్యం వినయ్‌భాస్కర్

## నేటి నుంచి అందుబాటులోకి రానున్న కార్యాలయాలు

పరకాల, ఏప్రిల్ 9 : పట్టణంలో నిర్మించిన నూతన ఆర్డీవో, తహసీల్ కార్యాలయాలు బుధవారం నుంచి అందుబాటులోకి రానున్నట్లు తహసీల్దార్ భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు హనుమకొండ రోడ్డులోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో తహసీల్ కార్యాలయం, రైతు శిక్షణా కేంద్రంలో ఆర్డీవో కార్యాలయాలను తాత్కాలికంగా నిర్వహించారు. పాత తహసీల్ కార్యాలయం ఆవరణలో సొంత భవనాలను నిర్మించగా బుధవారం నుంచి అందులో అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు విషయాన్ని గమనించాలని తహసీల్దార్ సూచించారు.

## సీఈఐఆర్‌తో సెల్ ఫోన్ అప్పగింత

దామెర, ఏప్రిల్ 9 : సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తి ఫిర్యాదుతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ ఆచూకీ తెలుసుకుని తిరిగి అప్పగించినట్లు ఎస్సై కొంక అశోక్ మంగళవారం తెలిపారు. మంచిర్యాలకు చెందిన మహ్మద్ తాజ్ మూడు రోజుల క్రితం దామెర మండలంలోని పులుకుర్తికి పెయింటింగ్ పని చేసేందుకు వచ్చాడు. అక్కడ సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. బాధితుడు ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ పోర్టల్‌ను ఉపయోగించి తాజ్‌కు సెల్‌ఫోన్‌ను అప్పగించామని ఎస్సై తెలిపారు.

## ఇమామ్‌లకు దుస్తుల పంపిణీ

పోచమ్మమైదాన్, ఏప్రిల్ 9: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని అన్ని మసీదుల ఇమామ్‌లు, మౌజంలకు మంగళవారం దుస్తులు పంపిణీ చేశారు. ఎల్‌బీనగర్ ప్రాంతంలోని మసీదులో జరిగిన కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు నవీన్‌రాజు, నల్లగొండ రమేశ్, కార్పొరేటర్ ఎండీ ఫుర్ఖాన్, సీనియర్ నాయకుడు మహ్మద్ అయూబ్ పాల్గొన్నారు. కాగా, రంజాన్ సందర్భంగా ఎల్‌బీనగర్‌లోని ఈద్గాలో ఉదయం 8.30 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు ఉంటాయని, ముస్లింలందరూ సకాలంలో హాజరు కావాలని కమిటీ అధ్యక్షుడు ఎండీ సాదిక్, ప్రధాన కార్యదర్శి మహ్మద్ అబ్దుల్లా తదితరులు తెలిపారు.



ఎర్రబెల్లి దంపతులను ఆశీర్వదిస్తున్న అర్చకులు

## శివాలయంలో ఎర్రబెల్లి పూజలు

పర్వతగిరి, ఏప్రిల్ 9: ఉగాది పర్వదినం సందర్భంగా మండలకేంద్రంలోని పర్వతాల శివాలయాన్ని మంగళవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సతీసమేతంగా సందర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివుడికి అభిషేకం, అర్చనలు చేశారు. అనంతరం ఆలయంలో పంచాంగ శ్రవణాన్ని ఆలకించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి దంపతులను భక్త బృందం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అనంతరం పర్వతగిరి బస్‌స్టేషన్ ప్రాంగణంలో శ్రీరామకృష్ణ సేవా సమితి, పర్వతాల శివాలయం భక్త బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని దయాకర్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో పర్వతగిరి ఎంపీటీసీ మాడుగుల రాజు, మాజీ ఉపసర్పంచ్ రంగు జనార్దన్‌గౌడ్, దుర్గారావు, శ్రీనివాస్, వేణుగోపాల్, యాకయ్య పాల్గొన్నారు.

## చెరువులో పడి మూడు బర్రెలు, ఎద్దు మృతి

- గవిచర్లలో పండుగ పూట విషాదం
- నష్టపోయిన రైతన్న

సంగెం, ఏప్రిల్ 9 : ఉగాది పండుగ పూట విషాదం చోటుచేసుకుంది. మండలంలోని గవిచర్ల గ్రామంలో ఏటా ఉగాది పండుగ రోజు గుండ బ్రహ్మయ్య జాతర జరుగుతుంది. ఈ సందర్భంగా గ్రామస్తులు వారికి ఉన్న ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లను గుడిచుట్టూ తిప్పుతారు. ఈ నేపథ్యంలో రైతు పత్తిపాక రమేశ్ తనకు ఉన్న ఎడ్లబండితో పాటు మూడు గేదెలను ఊరచెరువులో కడగడం కోసం సోమవారం తన పాలేరును తీసుకపోయాడు. ఎడ్లబండి వెనుక తాడుతో మూడు గేదెలను కట్టుకుని చెరువులోకి పోతున్న క్రమంలో ఒకేసారి ఎడ్లు వేగంగా కట్ట కిందికి వెళ్లాయి. దీంతో గతంలో రోడ్డు కోసం ప్రొక్లెయినర్‌తో తీసిన గొయ్యిలో అవి పడిపోయాయి. ఒక ఎద్దు బయట పడగా మిగతా ఎద్దుతో పాటు బండికి తాడుతో కట్టడం వలన గేదెలు కూడా అందులో పడి మునిగి మృతిచెందాయి. దీంతో రైతు రమేశ్ కుటుంబం కన్నీరుమున్నీరుగా విలపించింది. రూ.2లక్షల వరకు నష్టపోయినట్టు బాధితులు తెలిపారు. పండుగ రోజున గుడి చుట్టూ తిరగాల్సిన ఎడ్లబండికి కట్టిన ఎద్దు, గేదెలు మృతి చెందగా గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.



గవిచర్ల ఊర చెరువులో మృతి చెందిన గేదెలు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-311821

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో ప్రజలు విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

## రోడ్డుపై ప్రమాదకరంగా గుంత



ధ్వంసమైన రోడ్డు

చెన్నారావుపేట, ఏప్రిల్ 9: మండలకేంద్రంలో రోడ్డుపై ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే నర్సంపేట-నెక్కొండ ప్రధాన రహదారిపై చెన్నారావుపేటలో ఏర్పడిన గుంత వల్ల వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ ఏరియాకు కొత్తగా వచ్చే వాహనదారులు రాత్రి సమయంలో గుంతలో పడి గాయాలపాలవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇటీవల మేడారం జాతర సమయంలో అప్పలరావుపేటకు చెందిన ఓ కుటుంబం ఆటోలో వెళ్లి తల్లుల దర్శనం చేసుకొని తిరిగి ఇంటికి వస్తుండగా ఈ గుంతలో ఆటో బోల్తా పడి నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. అలాగే, అసంపూర్తిగా వదిలేసిన సీసీరోడ్డు కారణంగా నిత్యం రోడ్డుపై నుంచి వచ్చే దుమ్ముతో అనారోగ్యాల బారిన పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి గుంతను పూడ్చి, రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

## మద్యం పట్టివేత

పర్వతగిరి, ఏప్రిల్ 9: వడ్లకొండకు చెందిన నంగనూరి చంద్రశేఖర్ కిరాణం షాపులో మద్యం విక్రయిస్తుండగా మంగళవారం పట్టుకున్నట్లు ఎస్సై జీ వెంకన్న తెలిపారు. రూ. 3907 విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ సందర్భంగా ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## 90 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

చెన్నారావుపేట, ఏప్రిల్ 9: మండలంలోని టేకులతండాలో సోమవారం రాత్రి పోలీసులు 90 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. నెక్కొండ నుంచి గూడూరు వెళ్లే ప్రధాన రహదారిలో టేకులకుంట తండా శివారులోని చెట్ల పొదల్లో దాచిన 90 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నట్లు ఎస్సై గూడ అరుణ్ తెలిపారు. టాస్క్‌ఫోర్స్ ఎస్సై శరత్‌కుమార్, పీసీలు అశోక్, సత్యనారాయణ పాల్గొన్నారు.



పట్టుకున్న బియ్యాన్ని చూపుతున్న పోలీసులు

## ఆకట్టుకున్న అరుదైన పుష్పం



వికసించిన అరుదైన పుష్పం

శాయంపేట, ఏప్రిల్ 9 : మండలంలోని పెద్దకోడెపాకకు చెందిన ఉపాధ్యాయుడు కొమ్మినేని రఘు ఇంట్లో అరుదైన పుష్పం మంగళవారం వికసించింది. దక్షిణ అమెరికాలోని అర్జెంటీనా, పరాగ్వే, బ్రెజిల్ వెచ్చని ప్రాంతాల్లో పెరిగే ఈ పుష్పాన్ని జిమ్నో కాల్షియంగా పిలుస్తారు. 2018లో ఒక స్నేహితుడు గుజరాత్ నుంచి ఈ పుష్పాన్ని పంపించినట్లు రఘు తెలిపారు. ఏటా మేలో ఈ పుష్పం వికసిస్తుందని, ఈసారి ఉగాది రోజు వికసించడం సంతోషంగా ఉందన్నారు. ఈ పుష్పం ఇంట్లో రేడియేషన్‌ను గ్రహించి ఆరోగ్యానికి సహకరిస్తుందని రఘు తెలిపారు.

# అడుగడుగునా లీకేజీలు

- వృథాగా పోతున్న తాగునీరు
- అధ్వానంగా మారుతున్న నగర రోడ్లు
- అవస్థలు పడుతున్న వాహనదారులు, ప్రజలు



గుంతలమయమైన కాశీబుగ్గ-తిలక్‌రోడ్డు

పోచమ్మమైదాన్, ఏప్రిల్ 9: వరంగల్ మహానగర పాలక సంస్థ అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో నగర ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. వరంగల్‌లో తాగునీరు సరఫరా చేసే పైపులైన్లకు అడుగడుగునా లీకేజీలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో నీరంతా రోడ్డుపై పారుతుండడంతో రహదారులు అధ్వానంగా మారుతున్నాయి. తద్వారా వాహనదారులు, ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వరంగల్ 21వ డివిజన్ కాశీబుగ్గ, తిలక్‌రోడ్డు రోజురోజుకూ అధ్వానంగా మారుతున్నది. నర్సంపేట రోడ్డు నుంచి తిలక్‌రోడ్డు మార్గం ఆరంభంలోనే గుంతలమయంగా మారింది. కంకర తేలి, మోకాలి లోతు గుంతలు ఏర్పడి మురుగునీటితో నిండిపోవడంతో వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. కార్పొరేషన్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు రోడ్డుపై అడుగడుగునా పైపులైన్‌కు లీకేజీలు ఏర్పడ్డాయి. తిలక్‌రోడ్డు మొత్తం లీకేజీలతో నిండిపోయింది. దీంతో రోడ్డుపై తాగునీరు వృథాగా పారుతూ ఇళ్ల ఎదుట చెరువును తలపిస్తున్నదని స్థానికులు వాపోతున్నారు. నీటిగుంతల్లో పడి వృద్ధులు, పిల్లలు గాయాలపాలవుతున్నారని చెబుతున్నారు. అధికారులను పలుమార్లు నేరుగా కలిసినా, వినతిపత్రాలు అందజేసినా స్పందించడం లేదని విమర్శిస్తున్నారు. రోజూ ఉదయాన్నే శానిటరీ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది వచ్చి చూసి వెళ్లడం తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదని ఆరోపిస్తున్నారు.



వార్షికోత్సవంలో సాయి అశ్రిత్, సులక్ష్య సేవా సమితి సభ్యులు

## సమాజహితం కోరె యువత దేశానికి అవసరం

**యూపీ ఐఏఎస్ అధికారి శాఖమూరి సాయి అశ్రిత్**

న్యూశాయంపేట, ఏప్రిల్ 9 : సమాజహితం కోసం పని చేసే యువత దేశానికి చాలా అవసరమని వరంగల్‌వాసి, ఉత్తరప్రదేశ్ ఐఏఎస్ క్యాడర్ అధికారి శాఖమూరి సాయి అశ్రిత్ అన్నారు. హంటర్‌రోడ్‌లోని శ్రీవ్యాస ఆవాసంలో మంగళవారం సులక్ష్యసేవాసమితి 11వ వార్షికోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా శాఖమూరిసాయి అశ్రిత్ మాట్లాడుతూ సేవ చేయడానికి పదవులు అవసరంలేదని, దృఢమైన సంకల్పం ఉంటే సరిపోతుందన్నారు. ప్రముఖ రచయిత అంపశయ్య నవీన్ మాట్లాడుతూ యువకులు సేవలో నిమగ్నమై ఆదర్శనంగా నిలుస్తున్నారన్నారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మండువ సంతోష్, సాయికిరణ్, కోడం వినయ్, ప్రణీత్ కాపర్తి, నంబూరి సిద్ధార్థ, సిరూప సుశృత్, కొలిపాక ప్రకాశ్, శాఖమూరి చరణ్,కాజీపేట పురుషోత్తం, బోనాల శ్రీకాంత్, అంబటిపల్లి ఆదిత్య, ఆర్ భరత్, వ్యాస ఆవాస ప్రతినిధులు కే వసుంధర పాల్గొన్నారు.



గుట్టపైకి వెళ్తున్న భక్తులు

## ఘనంగా ఫకీర్‌షావలీ జాతర

ఎల్కతుర్తి, ఏప్రిల్ 9 : మండలంలోని దామెర గ్రామంలో ఏటా ఉగాది రోజు జరుపుకునే ఫకీర్‌షావలీ జాతర మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. హిందువుల పర్వదినమైన ఉగాది నాడే ముస్లింలు సైతం ఫకీర్‌షావలీ జాతర జరుపుకోవడం ఇక్కడ ఆనవాయితీ. ఉగాది నాడు హిందువులు భక్ష్యాలు, పిండి వంటలు చేసుకొని పచ్చడి తాగిన అనంతరం సాయంత్రం గ్రామంలోని గుట్టపై గల ఫకీర్‌షావలీ సమాధుల వద్దకు వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. జెండాలను చేత పట్టుకొని గుట్టపైకి నినాదాలు చేసుకుంటూ వెళ్లారు. ఈ జాతరకు మండలం నుంచే కాకుండా భీమదేవరపల్లి, హసన్‌పర్తి, ధర్మసాగర్, హుజూరాబాద్, హనుమకొండ తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా నిర్వాహకులు రహీమొద్దీన్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఎస్సై గోదారి రాజ్‌కుమార్ బందోబస్తు చర్యలు చేపట్టారు.

## భక్తిశ్రద్ధలతో గుండ బ్రహ్మయ్య జాతర



విగ్రహాలను దేవాలయానికి తీసుకొస్తున్న గ్రామస్తులు

సంగెం, ఏప్రిల్ 9 : మండలంలోని గవిచర్లలో సోమవారం రాత్రి గుండ బ్రహ్మయ్య జాతర ఘనంగా జరిగింది. ఏటా ఉగాది రోజు నిర్వహించే ఈ జాతరకు చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి ప్రజలు వచ్చి తరలివచ్చారు. ఆలయం చుట్టూ ఎడ్లబండ్లు, ట్రాక్టర్లను తిప్పి రైతులు తమ మొక్కులను తీర్చుకున్నారు. జాతర సందర్భంగా ఆలయం వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా మామునూరు ఏసీపీ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. వీరి వెంట పర్వతగిరి సీఐ శ్రీనివాస్, సంగెం ఎస్సై నరేశ్ తదితరులు ఉన్నారు.

## పెద్దమ్మతల్లి జాతరకు పోటెత్తిన భక్తులు

ఖిలావరంగల్, ఏప్రిల్ 9: ఓరుగల్లు ఖిల్లాలో పెద్దమ్మతల్లి జాతర మంగళవారం వైభవంగా జరిగింది. ఏటా ఉగాది పర్వదినం సందర్భంగా జరిగే జాతరకు మండల ప్రజలు పెద్ద ఎత్తున ఎడ్ల బండ్లపై తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ముదిరాజ్ పూజారులు హంస వెంకన్న, హంస శ్రీను, హంస పెద్దులు పెద్దమ్మతల్లి పట్నాలు వేశారు. తూర్పుకోట నుంచి మహిళలు బోనాలతో తరలివచ్చి పెద్దమ్మతల్లికి సమర్పించారు. నూతన సంవత్సరంలో పాడిపంటలు సమృద్ధిగా పండాలని, పిల్లాపాపలు చల్లంగా ఉండాలని పెద్దమ్మతల్లిని కోరుకున్నారు.

## దొరికిన సెల్ ఫోన్ అప్పగింత

గిర్మాజీపేట, ఏప్రిల్ 9: వరంగల్ చౌరస్తాలో మంగళవారం రోడ్డుపై తనకు దొరికిన రూ. 24 వేల విలువైన సెల్‌ఫోన్‌ను మామిడి గోపాల్ ఇంతెజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ మచ్చ శివకుమార్ సమక్షంలో బ్లూకోల్ట్ సిబ్బంది రాజయ్యకు అప్పగించి తన నిజాయితీని చాటుకున్నాడు. అనంతరం సిబ్బంది మండిబజార్‌కు చెందిన బీటెక్ విద్యార్థినిదిగా గుర్తించి, ఆమెకు సెల్‌ఫోన్ అందజేశారు. ఈ సందర్భంగా గోపాల్‌ను సీఐ, సిబ్బంది అభినందించారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ధర్మసాగర్, ఏప్రిల్ 9 : ధర్మసాగర్, పెద్దపెండ్యాల విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో 11 కేవీ విద్యుత్ మరమ్మతు నిమిత్తం బుధవారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని హనుమకొండ ఏడీఏ దానయ్య, ధర్మసాగర్ ఏఈ సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రాంత రైతులు, విద్యుత్ వినియోగ దారులు సహకరించాలని కోరారు.

**ఐనవోలులో..**

ఐనవోలు : ట్రీ కట్టింగ్, సబ్‌స్టేషన్ నిర్వహణ నేపథ్యంలో వెంకటాపురం 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని వెంకటాపురం, బావుల వద్ద విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ శివకుమార్ తెలిపారు. నేడు సాయంత్రం 4 నుంచి 6.30 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.



కంఠమహేశ్వరుడు, ఎల్లమ్మ తల్లికి నైవేద్యం సమర్పిస్తున్న గౌడ కులస్తులు

## కంఠమహేశ్వరుడికి ప్రత్యేక పూజలు

శాయంపేట ఏప్రిల్ 9 : మండలంలోని కొప్పుల, గంగిరేణి గూడెం గ్రామాల గౌడ కులస్తులు శ్రీ కంఠమహేశ్వర, సురమాంబ, ఎల్లమ్మ తల్లికి మంగళవారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తిశ్రద్ధలతో ఆరాధ్య దేవతలకు తాటి ముంజలు, ఉగాది పచ్చడి నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమంలో కుల పెద్ద మనుషులు చేరాలు, ఓదేలు, కల్లపు సుదర్శన్, కొమురయ్య, కృష్ణమూర్తి , తెలంగాణ జాగృతి జిల్లా నాయకుడు ఎండీ పాషా, మారెల్లి బాబురెడ్డి, రాజేశ్వరరావు, రవి, సుదర్శన్ రెడ్డి, జనార్దన్ పాల్గొన్నారు.

## నాటక కళాసమితి స్వర్ణోత్సవ సంచిక ఆవిష్కరణ

వర్ధన్నపేట, ఏప్రిల్ 9: మండల కేంద్రంలోని భారతీయ నాటక కళాసమితి ప్రారంభమై 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రూపొందించిన స్వర్ణోత్సవ ప్రత్యేక సంచికను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు మంగళవారం ఆవిష్కరించారు. మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, సమితి అధ్యక్షుడు ఎండీ అప్సర్, న్యాయవాది శేఖర్‌రావు, సిలువేరు కుమారస్వామి, సోమయ్య, సంజీవరావు పాల్గొన్నారు.



ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు